

పోతుగల్‌లో నిర్మించిన పల్లె దవాఖాన భవనం



గన్నెవానిపల్లెలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జీపీ భవనం

# ప్రగతి సంబురం

- మంత్రి కేటీఆర్ చొరవతో గ్రామాల్లో పూర్తయిన పనులు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ చేతులమీదుగా నేడు ప్రారంభోత్సవం

పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతున్నది. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వం పెద్ద ఎత్తులు నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో పలు గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు, పల్లె దవాఖాన, వైకుంఠధామం, అంగన్‌వాడీ భవనం, మహిళా సంఘ భవనం, సబ్‌స్టేషన్, వంతెనలు, కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, రైతు వేదిక నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చేతులమీదుగా అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభోత్సవం చేయనుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

– ముస్తాబాద్, అక్టోబర్ 7


మద్దికుంట గ్రామంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లు

ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మద్దికుంటలో డబుల్ బెడ్రూం ఇండ్లు, పల్లె ప్రకృతి వనం, పల్లె దవాఖాన, వైకుంఠధామం, అంగన్‌వాడీ భవనం, మహిళా సంఘ భవనం, నామాపూర్‌లో ₹33లక్షలతో కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, ₹22లక్షలతో రైతు వేదిక, బంధనకల్‌లో ₹33లక్షలతో జీపీ భవనం, ₹1.25కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్, ₹33 లక్షలతో కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, గన్నెవానిపల్లెలో ₹1.20కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్, ₹20లక్షలతో జీపీ భవనం, ₹50లక్షలతో సీసీ రోడ్లు, ₹75లక్షలతో నిమ్మలవానిపల్లె, కొండాపూర్‌వానిపల్లె మధ్య ఒర్రెపై వంతెన నిర్మాణం, ₹5లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్ రూ.5లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం ₹12.60లక్షలతో వైకుంఠధామం, పోతుగల్‌లో 48మందికి డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ, ₹33లక్షలతో కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, ₹22లక్షలతో రైతు వేదిక, ₹16లక్షలతో పల్లె దవాఖాన నిర్మాణం పూర్తికాగా, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఎస్‌టీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే పోతుగల్‌లో మోడల్ జీపీ భవనం, సీసీ రోడ్ల పనులు, గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ చేయనున్నారు.

## ప్రగతి పథంలో గ్రామాలు



మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. పోతుగల్‌కు కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశారు. ముస్తాబాద్ నుంచి జిల్లా కేంద్రం వెళ్లడానికి ₹35కోట్లతో బీటీ రోడ్డు, 48మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు, వాడవాడల్లో సీసీ రోడ్లు, ₹1.55కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం, పల్లె దవాఖాన, మోడల్ జీపీ భవనం, సరిహద్దు గ్రామాలకు బీటీ రోడ్లు, కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, రైతు వేదికల నిర్మాణాలు పూర్తయ్యాయి. నేడు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభోత్సవం జరుపుకోవడం సంతోషకరం.

*– తన్నీరు గౌతంరావు, సర్పంచ్ (పోతుగల్)*

## రుణపడి ఉంటాం



మాది పేద కుటుంబం. మాకు ఉండడానికి ఇల్లు లేదు. గుడిసెలో ఉంటూ కాలం ఎల్లదీస్తున్నాం. సారు దయతో మాకు మంచి ఇల్లు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి బంగ్లా వస్తదని అనుకోలేదు. మాకు ఇచ్చిన ఇల్లు ఊరికి దగ్గరలోనే ఉన్నది. మాకు ఇల్లు రావడం ఆనందంగా ఉంది. సారుకు రుణపడి ఉంటాం

*– తలారి లక్ష్మి, డబుల్ బెడ్రూం లబ్ధిదారు (పోతుగల్)*

## సొంతింటి కల నెరవేరింది



సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డాం. ఇలాంటి ఉచితంగా ఇస్తరని అనుకోలేదు. కూలీ చేస్తూ బతుకుతున్నాం, తెలంగాణ ప్రభుత్వం పైసా ఖర్చులేకుండా ఇల్లు ఇవ్వడం సంతోషకరం. ఊరు దగ్గర ఇండ్లు కడుతుంటే మాకు ఒక్కటి వస్తే బాగుండని అనుకున్నాం. మంత్రి కేటీఆర్ చొరవతో మాకు కూడా ఇల్లు మంజూరైంది. సొంతింటి కల నెరవేర్చి తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

*– మమత, డబుల్ బెడ్రూం లబ్ధిదారు (పోతుగల్)*

## మారిన గ్రామాల రూపురేఖలు



మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఊరూరా ప్రగతి పనులు పెద్దఎత్తున సాగుతున్నాయి. అమాత్యుడి చొరవతో రోడ్లు, నూతన జీపీ భవనాలు, సబ్‌స్టేషన్లు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించుకున్నాం. మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

*– జనగామ శరత్‌రావు, ఎంపీపీ (ముస్తాబాద్)*

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్: డీఐఈవో

తెలంగాణ చౌక్, అక్టోబర్ 7: విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఐఈవో మోహన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్టీ కోర్సుల్లో 60శాతం మార్కులు ఉన్న విద్యార్థులకు ల్యాబరేటరీలో టెక్నీషియన్ ఉద్యోగ అవకాశం కల్పించడం కోసం రాత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ రాత పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 12మంది విద్యార్థులు హాజరుకాగా, ఐదుగురిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు దూర విద్యద్వారా డిగ్రీ సర్టిఫికెట్లతోపాటు జీతం అందించనున్నట్లు కంపెనీ బాధ్యుడు బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

## గ్రామాల్లో సకల వసతులు: ఆగయ్య


దేవునిగుట్టతండాలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7: తండాల్లో సకల వసతులు కల్పించి ఆత్మగౌరవ తండాలుగా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన దేవునిగుట్ట నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్‌ను గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు సన్మానించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు గుగులోత్ పెంటయ్య, అజ్మీరా రజిత, ఉప సర్పంచ్ ప్రకాశ్‌నాయక్, నాయకులు కళ్యాణ్, బుగ్గ కృష్ణమూర్తి, నాజీం, అందె సుభాష్, రాగం ఎల్లయ్య, కొండ ఆంజనేయులుగౌడ్, తదితరులు ఉన్నారు.

## జిల్లెల్ల ఎక్స్‌రోడ్-ఇల్లంతకుంట రోడ్డుకు మహర్దశ

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 7: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ఎక్స్‌రోడ్ నుంచి ఇల్లంతకుంట రోడ్డుకు మహర్దశ పట్టనున్నది. ఈ రోడ్డును రెండు వరుసల రహదారి మార్చేందుకు ప్రభుత్వం రూ.13కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడంతో తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ఎంపీపీ పడిగెల మానస, జడ్పీటీసీ పూర్మాణి మంజుల, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు కొమ్మెట రాజిరెడ్డి, సర్పంచులు ప్రవంత భాస్కర్‌రెడ్డి, మాసిరెడ్డి అవినాష్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన విద్యనందించాలి: డీఈవో


పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

ఇల్లంతకుంట, అక్టోబర్ 7: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన పెద్దలింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి, మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రతి విద్యార్థి వంద శాతం మార్కులు సాధించేలా ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బోయిని తిరుపతి, శైలజ, కొమ్ము రమేశ్ ఉన్నారు.

## గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందజేత

సిరిసిల్ల రూరల్, అక్టోబర్7: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ జీపీ ఆవరణలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, గృహలక్ష్మి ప్రొసీడింగ్స్, బతుకమ్మ చీరలను సర్పంచ్ బైరి శ్రీవాణి శనివారం అందజేశారు. ఇక్కడ ఎంపీటీసీ సిలువేరి ప్రసూన, ఏఎంసీ డైరెక్టర్ బైరి రమేశ్, ఉప సర్పంచ్ అలువాల సాయిరాం, బొద్దుల రాజేశ్, కార్యదర్శి సలీం, అంగన్‌వాడీ కార్యకర్త శ్రావణి, సీఏ కళ్యాణి, సెస్ ప్రతినిధి రూప, గ్రామశాఖ అధ్యక్షుడు మహేశ్, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సాదుల భాస్కర్, సీనియర్ నాయకుడు వేముల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## గంజాయి విక్రేతల అరెస్ట్

సిరిసిల్ల, అక్టోబర్ 7: సిరిసిల్లలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల ఎక్సైజ్ సీఐ గులాం ముస్తాఫా పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరీ, కరీంనగర్ ఎక్సైజ్ ఉప కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది సిరిసిల్లలో ప్రభుత్వ దవాఖాన సమీపంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మార్కెండేయ వీధికి చెందిన ఎండీ నయీం, చింతకుంట సంతోష్ నాందేడ్ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 36 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కరీంనగర్ జైలు కు తరలించామన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శైలజ, ఎక్సైజ్ ఎస్ఐలు శేఖర్, రాజేందర్ సిబ్బంది ఏ శ్రీనివాస్, జీ శ్రీనివాస్, నరేందర్, మధుకర్, రాకేశ్, సుమన్, శంకర్ ఉన్నారు.

## రాబోయే ఎన్నికల్లో సమన్వయంతో పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 7: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. నాటుసారా తయారు చేసే, రవాణా చేసే ప్రాంతాలను గుర్తించాలన్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను విక్రయించే వారికి గుర్తించి తహసీల్ కార్యాలయంలో బైండోవర్ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించేవారు, రవాణా చేసేవారిపై ప్రత్యేక దృష్టిసారించి, పట్టుకోవాలన్నారు. ఇక్కడ ఎక్సైజ్ సీఐలు గులాం ముస్తఫా, గుంటేటి రాము, చంద్రశేఖర్ ఉన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. లోన్‌యాప్, లాటరీ, పార్ట్‌టైమ్ జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో మెసేజ్‌లు రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930, లేదా డయల్ 100నంబర్‌కి కాల్ చేయాలన్నారు.